# జీవిత సౌధము జన్మ,కర్మ,ధర్మ,బ్రహ్మ అనే నాలుగు గోడలపైన ఆధారపడియున్నది

**కారణంబున కల్గు ఘన మోహ బంధంబు**
**మోహమందు పెరుగు మూర్ఖబుద్ధి**
**మూర్ఖబుద్ధియందు మురియును కర్మంబు**
**కర్మఫలమువలన కలుగు జన్మ**

**విద్యార్థులారా!**

జన్మ, కర్మ, ధర్మ, బ్రహ్మ - యీ నాలుగు స్తంభముల మేడయే మానవుని యొక్క జీవితము. ఈ నాలుగు స్తంభములు అన్యోన్యాశ్రయములు, అవినాభావ సంబంధములు. ఇవి ఒకదానిపై ఒకటి ఆధారపడి వుంటున్నాయి. జన్మ దేని నిమిత్తమై? కర్మాచరణ నిమిత్తమై! ఎట్టి కర్మను మనము ఆచరించాలి? ధర్మమయమైన కర్మలు మనము ఆచరించాలి. ఈ ధర్మమయమైన కర్మద్వారా మనము బ్రహ్మము దర్శించాలి. అయితే యీనాడు మానవ జన్మ యీ విధమైన లక్ష్యమును మరచివున్నది. కర్మ కడుపు నిమిత్తమై, ధర్మము జగత్తు నిమిత్తమై. 'బ్రహ్మ' అనే భావము శూన్యము. ఏ చిన్న గృహము నిర్మింపవలెనన్నను నాలుగు గోడలు లేకుండా నిర్మించలేము. కనుక, యీ జీవితమనే భవనమునకు జన్మ, కర్మ, ధర్మ, బ్రహ్మ యీ నాలుగుకూడను ఆధారమైన గోడలవంటివి.

**మానవుని మంచి, చెడులకు కర్మలే కారణము**

ఐతే యీ జన్మకు కారణమేమిటి? జన్మకు కర్మయే కారణము. కర్మ అనగా యేమిటి? జీవనశక్తి. ఈ జీవిత శక్తియొక్క ఉపాధియే మానవ శరీరము. ఏతావాతా జీవిత ఉపాధియైన దేహమే కర్మ కాయము. అనగా కర్మలయొక్క మిళితమే మానవదేహము. ఈనాడు మానవుడు చేసే ప్రతి క్రియకూడా 'కర్మ' అని మనము ఉచ్చరిస్తున్నాము. ఈ కర్మలు మానవుడు యేదో ఫల నిమిత్తమై ఆచరిస్తున్నాడు. ఆ ఫలమును అనుభవించే నిమిత్తము కాయమును



sri sathyasai vachanamrutam

ధరిస్తున్నాడు. కనుకనే, 'కర్మానుబంధీని మనుష్యలోకే' అన్నారు. ఈ మనుష్య లోకమంతయు కర్మచేత కట్టబడినది. కర్మకు మనము దూరముగా వుండుటకు వీలుకాదు. సర్వము కర్మలమయమై వుంటున్నది. కనుక, కర్మాచరణము అత్యవసరము. ఎట్టి కర్మలు ఆచరించిన అట్టి స్థితిని మనము పొందుతాము. ఎట్టి చర్యలో అట్టి అభ్యాసము, ఎట్టి అభ్యాసమో అట్టినడక, ఎట్టి నడకనో, అట్టి భవిషత్తు. కనుకనే, మన చర్యలు మంచివిగా వుంటుండాలి. జీవితమంతయు, మంచి చెడ్డలంతయు కర్మలపైన ఆధారపడి వుంటున్నవి. 'నేను చేయుచున్నాను, నేను అనుభవిస్తున్నాను, నేను ఆనందిస్తున్నాను', అనుకోటము అహంకారముయొక్క లక్షణము. మానవునియొక్క సమస్త మంచి, చెడ్డలు కర్మలపైనే ఆధారపడివుంటున్నవి. తెలిసినా, తెలియకపోయినా కర్మలయొక్క ఫలితమే మన చర్యలు.

**'కర్మానుబంధీని మనుష్యలోకే'**

మహాభారత యుద్ధానంతరము కృష్ణుడు ధర్మరాజును సమీపించి, 'ధర్మరాజా! యుద్ధము సమాప్తి అయినది. విజయమును సాధించినారు. ఇక నీవు పట్టాభిషిక్తుడు కావాల'ని ఆజ్ఞాపించాడు. కాని, ధర్మజుడు దానికి అంగీకరించలేదు. 'కృష్ణా! యింతమంది బంధుమిత్రులను, గురువులను, ఆత్మీయులను చంపి నేను యీ రాజ్యమును ఏలడమా? ఎవరిని ఏలాలి? ఏ ప్రజలను చూచి నేను ఆనందించాలి? ఎవరి నిమిత్తమై నేను రాజు కావాలి? అనేకమంది బంధువులను చంపితిని, చంపించితిని. తుచ్ఛమైన యీ స్వార్థ నిమిత్తమై నేను యీ రాజ్యమును పట్టము కట్టుకోటమా? నాకీ రాజ్యము అక్కరలేద'ని అనేక విధములుగా కృష్ణుని ప్రార్థించాడు. తాను పట్టాభిషిక్తుడు కావటానికి అంగీకరించలేదు. ఇంక అధికముగా చెప్పటము ప్రయోజనము వుండదని కృష్ణుడు గుర్తించాడు. కారణము లేకుండా కార్యము జరగదు. భగవంతుడు నిమిత్తమాత్రుడైనప్పటికి, ఒక్కొక్క దానిని ఒక్కొక్క రీతియైన ఆదర్శముగా గైకొని అనేకమందిద్వారా అనేక విషయములను బోధిస్తూ వుంటాడు. ప్రజలకు భగవంతుని వాక్యములు ఒక్కొక్కపరి విలువలేనివిగా కనుపిస్తూ వుంటాయి. దీనికి కారణము అతి సమీపముగా వుండటం, అతి సన్నిహితుడుగా వుండటమే! కనుక, లోకములో పెద్దలు అనేవారిద్వారా యీ ధర్మరాజుకి చెప్పించాలని సంకల్పించుకున్నాడు, కృష్ణుడు. నెమ్మదిగా

sri sathyasai vahini vachanamrutam

అంపశయ్యపై వుండిన భీష్మునిదగ్గరకు తీసుకువెళ్లాడు, ధర్మరాజుని. 'భీష్మా'! నీ వాక్యములకు ధర్మజుడు అతి గౌరవమును అందిస్తాడు. కావున అతడు పట్టాభిషిక్తుడు కావటానికి తగిన వుత్సాహ ప్రోత్సాహములు కల్పించు'మన్నాడు. ఈ పని భీష్మునికి అప్పజెప్పి కృష్ణుడు వెనుతిరిగాడు. భీష్ముడు ధర్మజునివైపు తిరిగి కంటిధారలు కారుస్తూ 'ధర్మజా! నా మాటలు విశ్వాసముగా అందుకుంటావా'? అన్నాడు. ధర్మజుడు చేతులు పట్టి మ్రొక్కుతూ 'నేను తమ ఆజ్ఞను యేనాడూ వుల్లంఘించలేదు. ఇకముందుకూడా వుల్లఘించన'ని వాగ్దానము చేశాడు. అప్పుడు భీష్ముడు 'ధర్మజా! యుద్ధమునకు పూర్వము కృష్ణుడు నీకవసరము. కృష్ణుని వాక్యములు వేద వాక్కులు. ఈనాడు నీ కార్యము విజయవంతమైనది. కానీ, యే కార్యమునకు పూర్వము ఏ వ్యక్తి మనకు యెంత ఆధారమో, యెంత ముఖ్యమో, ఎంత పవిత్రమో విజయమును సాధించిన తరువాతకూడను ఆ వ్యక్తియొక్క వాక్యములు, వ్యక్తికూడను అంత ఆధారము, అంత ముఖ్యము. కార్యము జరిగిన తరువాత వారిని, వారి వాక్కులను అలక్ష్యము చేయుటము, విస్మరించటము వ్యక్తియొక్క కర్తవ్యము గాదు. కృష్ణుని ఆజ్ఞను నీవు యెందుకు శిరసావహించటము లేదు? కృష్ణుడు సామాన్యమైన వ్యక్తివలె నీవు భావిస్తున్నావు. కేవలము అతనిని నీ బంధువుగా నీవు విశ్వసిస్తున్నావు. నిజమే! భగవంతుడు మిత్రుడే, బంధువే; కాని, తనయొక్క శక్తి తత్వాన్ని నీవు పూర్తిగా గుర్తించటములేదు. నీవు బహిర్దృష్టితోనే చూస్తున్నావు. నీ దృష్టిని అంతర్ముఖము గావించుకొని చక్కగా ఆలోచించమన్నాడు. అప్పుడు ధర్మరాజు చెప్పాడు, 'పితామహా! గొప్ప గొప్ప వ్యక్తులనుకూడను నేను సంహరించితిని. సంహరింపచేయించితిని. తండ్రిని కోల్పోయిన పిల్లలమైన మమ్ములను దగ్గర చేర్చి తండ్రికంటె అధికముగా ప్రేమించి, పెద్ద గావించిన మిమ్ములనుకూడను నేల కూల్చితిమి. విలు విద్యలో మేటియైన సాటి యెవరు లేరని ప్రఖ్యాతి గాంచిన భీష్మపితామహులగు మిమ్ములను అనేక బాధలకు గురిచేసితిమి. గురువైన ద్రోణాచార్యుని అసత్యవాక్యములచేత అస్త్రశస్త్ర విద్యలకు దూరము గావింపజేసితిమి. అనేకమంది ప్రియ బంధువులను, మిత్రులనుకూడను సంహరించితిమి. ఈనాడు యే ముఖము పెట్టుకొని రాజ్యము నేలాలి? ఏ ముఖము పెట్టుకొని నేను సింహాసనము అలంకరించటము? దయచేసి నాకు పట్టము కట్టకండి!' అని ప్రార్థించాడు. భీష్ముడు చిరునవ్వు నవ్వుతూ 'కర్మానుబంధీని మనుష్యలోకే! ధర్మజా! సర్వము యెరిగిన వాడవు, నీవు. ప్రతి దానికి కర్మయే కారణము గాని

sri sathyasai vachanamrutam

వ్యక్తులు కాదు. కార్యము కాదు. అనేక మందిని చంపితిని అని నీవు మాటాడుతున్నావు. చంపువారెవరు? చంపించువారెవరు? చంపెడి శక్తి నీకు లేదు. చంపించే శక్తి కూడా నీకు లేదు. చంపునది, చంపించునది, బ్రతికించునది, తమ తమ చేసెడి కార్యములే! దీనికి ఒక చిన్న కథ చెబుతాను, అని భీష్ముడు కథ ప్రారంభించాడు.

"ఏకైక పుత్రుడు కల్గిన ఒక తల్లి భర్తను కోల్పోయి ఆ కుమారుని తీసికొని అరణ్యములో ప్రయాణమై ప్రక్క గ్రామమునకు వెళ్లుతున్నది. అలసిపోవటంచేత ఒక చల్లని వృక్ష ఛాయక్రింద మాట్లాడుతూ కొంత విశ్రాంతి తీసుకొనుటకు కూర్చున్నారు. ఆ తల్లి సామాన్యమైన తల్లి కాదు. కర్మలయొక్క మర్మమును చక్కగా గుర్తించిన మాతృదేవి. కొంతసేపు కుమారుని తొడపైన పండబెట్టుకొని కొంత విశ్రాంతి తీసుకుందామని తలవాల్చి కన్ను మూసింది. ఆ కుమారుడు కొంతసేపటి లోపలే కెవ్వుమని యేడ్చాడు. తల్లి కన్నువిప్పి చూచింది. ఆ సమయములో ఒక పుట్టనుండి పాము వచ్చి కుమారుని కరచి పుట్టలోకి తిరిగి వెళ్లిపోతున్నది. ఆ దృశ్యము చూచింది, తల్లి. రక్తము కారింది. కొంతసేపటిలోపలనే కుమారుడు మూర్ఛిల్లినాడు. అటు, యిటు, చూచే లోపలనే ప్రాణం పోయింది. ఆ కుమారుని ముందు పెట్టుకొని గోడుమని యేడుస్తున్నది, తల్లి. అదే మార్గములోపల దారులు కొట్టే ఒక దొంగ ప్రయాణమై పోతున్నాడు. తానుకూడను విశ్రాంతి తీసుకొనుటకై ఆ చెట్టుక్రిందకు వచ్చాడు. ఈ దుఃఖించుచున్న తల్లిని చూచి ఆ కిరాతకుని హృదయముకూడను కరిగిపోయింది. 'తల్లీ! మీరు ఎందుకు ఏడుస్తున్నార'ని ప్రశ్నించాడు. 'నా కుమారుడు మరణించాడు. తల్లి దుఃఖము సహజమే కదా నాయనా!' అని చెప్పింది. ఆ పిల్లవాని మరణమునకు కారణమేమిటని ప్రశ్నించాడు, తిరిగి. 'ఒక పుట్టనుండి పాము వచ్చి కరచి పోయింది,' అంది. పాముకాటుచేత మరణించాడని చెప్పింది. తక్షణమే ఆ తల్లిని సంతోషపెట్టి దుఃఖమును సాధ్యమైనంతవరకు నివారింపజేయాలని ఆ పుట్టను కొట్టి పామును చంపటానికి ప్రయత్నించాడు, యీ కిరాతకుడు. అప్పుడు ఆ తల్లి బిడ్డను ప్రక్కనపెట్టి కిరాతకుని చేయిపట్టుకొని 'నాయనా! పామును కొట్టవద్దు. పామును చంపినంత మాత్రమున నా కుమారుడు లేచి రాలేడు. నా కర్మ నాకు తప్పినది కాదు. కనుక దానిని మీరు చంపకండి' అంది. 'ఈ విషసర్పము మిమ్మల్నే కాదు, యేనాడైననూ ఎవరైనను యీ ఛాయలకు చేరినవారికి యీ విధమైన పరిస్థితి కల్పింస్తుంది కదా! కనుక, యీ సర్పమును చంపటము నా ధర్మము'



srisathyasaivachanamrutam

అన్నాడు. అప్పుడు తల్లి బోధిస్తుండాది, 'నాయనా! కాలునియొక్క ఆజ్ఞచేత యీ కాలసర్పము యీ విధముగా వచ్చి నా కుమారుని గొనిపోయింది. ఇది కేవలము నా కుమారుని కర్మఫలమే'. ఈ కుమారునియొక్క మరణమునకు దుఃఖించటము నా కర్మ ఫలమే! కర్మను ఆచరించే సమయములో మనకు యే మాత్రము తెలియదు. దుఃఖ సమయమునందు మాత్రమే మనము విచారిస్తాము. ప్రతి దుఃఖమునకు, ప్రతి మంచికికూడను దాని వెనుక ఒక కర్మ అనేది వుంటున్నాది. కనుక, నీవు యీ సర్పమును చంపటము న్యాయముకాద'ని చెప్పింది. 'యముడు యముడు' అంటారు. ఈ యముడుకూడను యేదో ఒక రూపముగా వచ్చి, యీ కాల సర్పముగా వచ్చి మరణమనే ప్రసాదము నందించి తన స్థానమునకు తాను వెళ్లుతుంటాడు. యమునకు 'కాలుడు' అని పేరు. కాలుడనగా కాలమే! కనుక ప్రతిదానికి కాలము ప్రధానము. కాలము ప్రమాణము. కనుక, యీ కాలసర్పమనేది యే రూపములోనైనా వచ్చి కష్టము కలిగిస్తూవుంటుంది.

కనుక, ధర్మజా! ప్రతిదానికి కర్మయే కారణము. సామాన్యమైన గృహిణికి తెలిసిన నీతి నీకు తెలియక పోయినదా! కుమారుడు మరణించినప్పటికిని కర్మ యొక్క మర్మమును ఆ గృహస్థురాలు చక్కగా వివరింపజేసింది. ధర్మజా! నీవు సత్యధర్మములు ఎరిగినవాడవు. పంచమహాపాతకములలోపల జూదము చాలా పాతకమని తెలిసికూడ నీవు జూదము ఆడటంచేత అరణ్యవాసము చేసి అనేక కష్టములు అనుభవించవలసి వచ్చింది. అసలు నీ అరణ్యవాసమునకు, నీ కష్టమునకు, నీ కుటుంబము బాధలకు కారణము నీ కర్మలే కదా! కర్మలను దాటటము ఎవరి తరము కాదు. అయితే, దైవానుగ్రహముచేత యెట్టి కర్మలైనను మనము దాటవచ్చు. దైవాజ్ఞనే మీరిన తరువాత యీ కర్మను ఎవరూ తప్పించలేరు. దైవాజ్ఞయే సర్వ కర్మలకు మూలాధారము. దైవముయొక్క వాణి అన్ని విధములైన కర్మ పరిహారములను గావించగలదు. కనుక, దైవాజ్ఞను నీవు శిరసావహించటమే ప్రధానమైనది. దానిని ఉల్లఘించితివా. యిక నీ జన్మకు యే మాత్రము సార్ధకము వుండదు. కనుక, కృష్ణుని ఆజ్ఞను శిరసావహించ"మని బోధించాడు. కాని, ధర్మజునికి యింకా యీ కర్మఫల విషయములోపల అనుమానము పెరుగుతూనే వుంది. పుట్టలోనున్న పాము పిల్లవానిని కరచటము యిది కాలునియొక్క సంకల్పమే అంటున్నారు. భగవంతుడు ఆయా వ్యక్తుల కర్మాను సారముగా యే రూపములో నైనా, ఏ

srisathyasaivachanamrutam

స్థానములోనైనా, ఏ విషయమునందైనాకూడను వాటియొక్క ఫలితములను అందిస్తూ వుంటాడు. మన బాధలు, ఆనందములు, ఇవన్నియు కూడను కర్మానుసారమైనవే! దుష్టులైన, దుర్మార్గులైన కౌరవులు ధర్మమూర్తులైన పాండవులను హింసించటంచేతనే వారి వంశము తుడిచివేసినట్లైనది. సర్వనాశనమైంది. దైవము పాండవులవైపు వుండటంచేత పాండవులు దిగ్విజయమును సాధించారు. అర్జునుడు కృష్ణునియొక్క వాక్యము తాను శిరసావహించటంచేత విజయమును సాధించగల్గాడు. అయితే యుద్ధము జరిగేంతవరకు కృష్ణుని ఆజ్ఞను శిరసావహించారు, పాండవులు. యుద్ధములో విజయము సాధించిన తరువాత కృష్ణుని వాక్యములకు విరుద్ధముగా చెబుతున్నారు. యిది సరైన నీతి కాదనియు, సరైన ప్రవర్తన కాదనియు, మానవునకు వుండవలసిన ధర్మము కాదనియు భీష్ముడు ధర్మరాజుకి బోధించాడు.

**కర్మదాట వశమా, నరుడా! కర్మదాట వశమా!**
**ధనికుడు తృటిలో బికారి కాడా – పండింతుడింతలో పశువైపోడా**
**కట్టేపామై కరువను రాదా – కర్మే హేతువు కర్మేమూలము ॥ కర్మ ॥**
**చిన్న చెరువులో ముంచిననైనా – ఎన్ని సముద్రముల్ ముంచిననైనా**
**కడవెంతో నీరంతేరా – కావాలన్నను ఎక్కువ రాదురా ॥ కర్మ ॥**
**ఘనపాఠంబులు చదివినగాని – కుల దేవతలను కొలచినగాని**
**కారడవులకే పోయినగాని – కఠిన తపస్సులే చేసినగాని**
**భుజబలమెంతో చూపినగాని – మొనగాడనుచు మురిసిననైన ॥ కర్మ ॥**

కనుక, యీ కర్మ యే రూపములో వెంటాడుతుందో చెప్పుటకు వీలుకాదు. 'నేను పశువును, నాకు కఠినమైన కొమ్ములుంటున్నాయి. నేను చాలా బలవంతురాలను', అని తాను మురిసి పోయినప్పుడు తనకు కర్మ అనేది ముక్కుతాడు మాదిరి వచ్చి చేరిపోతుంది. మనకు ఏ సమయములో యే విధమైన బాధలు సంభవించినప్పటికిని, ఆ బాధలన్నియుకూడను మన కర్మానుసారము అనుభవించవలసినదే! కర్మానుసారమైన యీ ఫలములను అనుభవించేటప్పుడు మనము భగవదనుగ్రహమును సాధించితిమా, యీ కర్మలు యేమాత్రము మనలను బాధించలేవు.

srisathyasaivachanamrutam

**సత్కర్మలు ఆచరించి సత్ఫలితమును పొందాలి**

ఒకనొక సమయములో యశోదకూడను బాధపడింది, 'శ్రీ మన్నారాయణుడే కృష్ణావతారమెత్తి యీ విధమైన బాల్య స్వరూపములోపల పుట్టినప్పటినుండి అనేక విధములైన రాక్షస బాధలను తప్పించుకోలేకపోతున్నాడే', అని. అక్రూరుడు వచ్చి మథురాపురికి తీసుకువెళ్లాడు. ఆ పుర వీధులలోపల ముష్టి యుద్ధము చేసేవారు వెంటబడి తరుముతుంటే బలరామకృష్ణులు బజార్లవెంట తిరుగుతున్నారనే వార్త వినింది, యశోద. బలరామకృష్ణులను పట్టే నిమిత్తమై, తమ కాళ్లక్రింద వేసుకుని త్రొక్కే నిమిత్తమై, కంసుడు మదగజములనుకూడను వారిపైన వదలి పెట్టాడనే వార్త యశోద వినింది.

**పసి కందులగు మీపై కంస భూపాలుడు**
**మద గజంబును వదల మనసెట్లులొప్పెనో**
**కన్ననాటిమొదలు కడగండ్ల పాల్జేసి**
**కంటితో జూచు నా కర్మ ఫలమేమో**
**నరరాక్షసులు చేరి పురవీధులలో తరుమ**
**బాధలెన్నిపడిరో బలరామకృష్ణులు.**

యశోదకూడను ఆనాడు యీ కర్మ ఫలముపైననే తాను ఆధారపడుతూ వచ్చింది. పుట్టినప్పటినుండికూడను కంసుడు పంపిన దూతలు కృష్ణుని హింసించిన బాధలను చూడటంకూడను తన కర్మఫలమేనని కర్మఫలమును మాత్రమే చింతిస్తూ కూర్చుంది, యశోద. అయితే యీనాడు మానవులు కర్మవిషయమై చింతించటము లేదు. ఎవరో కొందరు వ్యక్తులను నెపముగా వుంచుకొని, ఆ వ్యక్తులవలన తమకీ బాధలు వచ్చాయి అని వ్యక్తులను మాత్రమే నిందిస్తూ కూర్చుంటున్నారు. తాము ఆచరించవలసిన కర్మలనుగురించి మాత్రము చింతించటంలేదు. ప్రతి ఫలితమునకు మన కర్మలే కారణము. విత్తనము లేకుండా మొక్క రావటానికి వీలుకాదు. మన జన్మాంతర కర్మలు లేకుండా ప్రస్తుత ఫలితము లభించటానికి వీలేలేదు. కనుక, మంచి కర్మలాచరించి మంచిని నీవు అనుభవించటానికి ప్రయత్నించాలి. ధర్మరాజంతటివాడు 'యీ కర్మలయొక్క ఫలితమే నా యీ దుఃఖమునకు మూలకారణము'

sri sathyasai vachanamrutam

అని గుర్తించుకోలేక పోయాడు. ప్రతి మానవునకు సుఖముగాని దుఃఖముగాని, లాభముగాని, నష్టముగాని, ఆనందముగాని, విచారముగాని, తమ కర్మలయొక్క ఫలితమే! ఈ అన్నింటికంటెకూడను దైవముయొక్క వాక్యమును విస్మరించటము, ధిక్కరించటము యిది మరింత కర్మలకు మూలకారణము. దైవాజ్ఞను శిరసావహించటము అత్యవసరము.

**రాముడంతటివాడు రమణి సీతను బాసి**
**పామరునివలె ఏడ్చెనన్న**
**ఏనాడు యే తీరొ ఎవరు చెప్పగలరు**
**అనుభవించుట సిద్ధమన్నా**
**అలనాటి పాండవులు ఆకులలములు మేసి**
**అడవిపాలైపోయిరన్నా**

దీనికి కారణం ఏమిటి ? ప్రతి దానికికూడను కర్మలే కారణము. కనుకనే వేదమునందు కర్మ సిద్ధాంతమును ప్రధానముగా బోధిస్తూ దానిని అన్ని విధముల విచారించటానికి అవకాశము నందిస్తూ వచ్చాయి. వేదములలోని ప్రతి వాక్యమునందు ఒక పవిత్రమైన అర్థమును గుర్తించి వర్తించటము అత్యవసరము. వ్యక్తుల విషయమై మనము యేనాడు విచారించకూడదు. నీ కర్తవ్యమును గురించి నీవు విచారించుటకు ప్రయత్నించు. మేధాశక్తి కల్గినవారు విషయములను గూర్చి విచారిస్తూ వుంటారు. సామాన్య మానవులు సంప్రదిస్తూ వుంటారు. అల్పులైన మానవులు వ్యక్తుల గూర్చి విచారిస్తూ వుంటారు. ఈ వ్యక్తుల గూర్చి విచారించటమనేది చాలా తప్పు. విషయమును గూర్చి మనము విమర్శిస్తూ రావటము అది కూడను తప్పు. ప్రతి విషయమునకు, ప్రతి కర్మకు యేదో ఒక కారణము వుంటుండాలి. ఆ కారణము కర్మలయొక్క ఫలితమై వుంటుండాది. కనుకనే ప్రతి మానవుడుకూడను ఏ ఫలితమునకైనా దీని వెనుక వుండిన కర్మయే దీనికి కారణము అని విశ్వసించాలి. అలా విశ్వసించి మంచి కర్మలు ఆచరించటానికి ప్రయత్నించాలి. ఒకరు చూచినా, చూడక పోయినప్పటికిని 'నా కర్మ నాకు తృప్తికరముగా వుందా' అనే విచారణ చెయ్యాలి. 'ఎవరూ చూడలేదులే, ఎవరికీ తెలియదులే' అనే రీతిగా మనము చెడు కర్మలు ఆచరిస్తూ పోవటంవలన యెవరూ చూడకపోవచ్చుగాని 'ఇతరు లెరుగకున్న

sri sathyasaivachanamrutam

ఈశ్వరుండెరుగడా'! ఇతరులు చూచినా చూడక పోయినాగాని దైవదృష్టి ఎప్పుడూ కూడను యింటనే జంటనే, వెంటనే, కంటనే వుంటున్నది. కనుక, మన ప్రవర్తనలు సరైన మార్గములో వుంచుకోవాలి. 'దాంతి కాక, వేదాంతుడు కాడు' అన్నారు. యీ ప్రాపంచిక సంబంధమైన విషయములే మనము గుర్తించుకోలేకపోయినప్పుడు మనము వేదాంతమనేది యే రీతిగా గుర్తించుకోగలము? గుర్తించుటకు వీలుకాదు. సర్వసామాన్యమైన ప్రాపంచిక విషయములే గుర్తించటానికి ప్రయత్నించలేని మనము పరిపూర్ణమైన జ్ఞానమును యే రీతిగా గుర్తించటానికి వీలవుతుంది?

## వ్యక్తి, సమాజము, దేశము, ఈ మూడు త్రిమూర్త్యాత్మక స్వరూపము

ఈ ప్రపంచములో శాంతి నెలకొల్పాలని మనం ప్రయత్నిస్తున్నాము. జీవిత అంతరాంతరాలలో తన దృష్టి ప్రవేశింప చేయలేనివాడు, సువిశాల జ్ఞానతత్వాన్ని గుర్తించలేనివాడు విశ్వశాంతిని చేకూర్చటానికి యే రీతిగా అర్హుడౌతాడు? వ్యక్తియొక్క తత్వమే సమాజముయొక్క శక్తి. సమాజముయొక్క శక్తియే దేశముయొక్క శక్తి. కనుక, వ్యక్తి, సమాజము, దేశముకూడను త్రిమూర్త్యాత్మక స్వరూపములు. వ్యక్తి లేక సమాజము లేదు, సమాజము లేక దేశము లేదు, కనుక వ్యక్తిగా నీవు అభివృద్ధి అయినప్పుడే, వ్యక్తిగా నీవు సార్థకత పొందినప్పుడే సమాజమును తీర్చిదిద్దడానికి అర్హత గలవాడవవుతావు. ఈనాడు మనము తెలివితేటలను అధికముగా పెంచుకొనుటకై ప్రయత్నిస్తున్నాము. జడమైన అమిత తెలివితేటలకంటె, చైతన్యవంతమైన మిత తెలివితేటలు చాలు. ఈనాడు మన తెలివితేటలన్నీ జడస్వరూపము ధరిస్తున్నాయి. కానీ చైతన్యము స్తంభించిపోయింది. పరిమితమైన తెలివితేటలుండినా చాలు, చైతన్య స్వరూపకంగా వుండాలి. అనగా క్రియాత్మకంగా వుండాలి. చిన్న విషయమైనా ఆచరణరూపకంగా పదిమందికి మంచిని చేయటానికి ప్రయత్నం చేయాలి.

## మన ఆదర్శములు శాశ్వతమైనవిగా ఉండాలి

విద్యార్థులారా! మన మంచి చెడ్డలకు, మన సుఖదుఃఖములకు, మన ఆనంద ఆహ్లాదములకు, లాభనష్టములకు, మన కీర్తి గౌరవములకు మన కర్మలే కారణము. కనుక, సత్కర్మలు ఆచరించాలి. తాత్కాలిక ఫలితములకై మీరు అఱ్ఱులు చాచకండి. మన ఆదర్శములు

sri sathyasaivachanamrutam

శాశ్వతమైనవిగా వుంటుండాలి. సీటు వచ్చేంతవరకు, కాలేజీలో చదివేంతవరకు మాత్రమే కాదు, మన discipline మరియు విశ్వాసములు. భీష్ముడు చెప్పాడు, 'యుద్ధమయ్యేంతవరకేనా నీకు కృష్ణుడు అవసరము? విజయాన్ని సాధించేంతవరకేనా నీకు కృష్ణుడు అవసరము? యుద్ధానంతరము నీకు కృష్ణుడు అక్కర లేదా?' అని. ఆ ఒక్క మాటలే ధర్మజుని హృదయములో సూటిగా నాటుకొనిపోయాయి. కానీ, యీనాటి విద్యార్థుల హృదయములోపల యీ విజ్ఞానము యేమాత్రము కనిపించుట లేదు. సీటు యిచ్చేంతవరకేనా సాయిబాబా అవసరము? చదివేంతవరకేనా సాయి Institute ? చదువు పూర్తి అయిన తరువాత నీకు సాయిబాబా మాట అక్కరలేదా ? కాదు, కాదు, ఎప్పటికీ అవసరమే! ఆ మాటను మనము మరచితిమా, అన్ని విధములైన దుఃఖములకు గురైపోతాము. నిత్య సత్యము ననుభవింప సత్యహరిశ్చంద్రుడు తన మాట నిలబెట్టుకొనుటకొరకు తాను వల్లకాటిలో కొలువు చేయలేదా? ఒక్క మాటకోసమని చెప్పి మహా చక్రవర్తిగా వుండిన హరిశ్చంద్రుడు కాటి కాపరిగా తయారయ్యాడు. అక్కడకూడ తన మాట తప్పలేదు. మాటను నిలబెట్టుకొనుటకై తన భార్యను అమ్మినాడు. మాట పోయిననాడు మనిషి పోయినట్టే! కనుక మాటను మనము నిలబెట్టుకోవాలి. ఈ మాటలు ఎక్కడనుండి వస్తున్నాయి, తలంపునుంచి వస్తుండాలి. ఈ తలంపు యెక్కడనుండి వస్తున్నాది? అహంనుండి వస్తుంది. అహం ఎక్కడనుండి వచ్చింది? ఆత్మనుంచి వచ్చింది. కనుక, ఆత్మయొక్క అంశమే యీ మాట. కనుకనే మనయొక్క మాటను భగవదంశముగా మనము భావించాలి. మాట పోయినవాడు మూతి పోయినవాడే? కనుక, మనము మాటను అతి జాగ్రత్తగా వుంచుకోవాలి. ఎవరి మనసును నొప్పించని రీతిగా మనము మాటను వుపయోగించుకోవాలి. ఎవరిని దూషించటానికిగాని ఎవరిని విమర్శించటానికిగాని మన నాల్కను వుపయోగపెట్టకూడదు.

### త్రికరణ శుద్ధి అనగా మనో వాక్కాయముల పరిశుద్ధత

అసత్యముతో దూషితము కానట్టి వాక్కు, హింసాదులతో దూషితము కానట్టి దేహము, రాగద్వేషాదులతో దూషితము కానట్టి హృదయము, యీ మూడే త్రికరణ శుద్ధి. అనగా మనస్సు పరిశుద్ధము, దేహము పరిశుద్ధము, వాక్ పరిశుద్ధము. ఈ మూడింటిని కాపాడుకొనుటకై మనము చదువులు చదవాలి. చదువు నిమిత్తమై

srisathyasai vachanamrutam

చదువుతున్నామనుకుంటున్నాము, మనము. చాలా పొరపాటు. చదువుకోసము కాదు, మనము చదవటము. చదువువల్ల లభించే ధనము కోసము మనము చదువుతున్నాము. కనుక, మనము ధనము కాదు, జ్ఞానము సంపాదించాలి. ఈ జ్ఞానధనము యేనాటికి తరిగేది కాదు. జీవితము తరిగినా అది పెరిగేది. కనుక, అందరియందు ప్రీతిభావము కలిగి, దైవ వాక్యము శిరసా వహించి, నిరంతరము హృదయములోపల ఆ సత్యమును మనము విశ్వసిస్తూ రావాలి. అట్టి సత్య, జ్ఞాన, మనంతస్వరూపమైనట్టిదే మానవత్వము. మానవత్వమును కేవలము అల్పత్వముగా భావిస్తున్నాము, మనము. పెద్దల వాక్యములుగాని, గురువుల వాక్యములుగానీ, దైవ వాక్యములుగానీ మనము హేళనగా అనుభవించరాదు. సాక్షాత్తు కృష్ణమూర్తి ఆవిర్భవించినది, అవతరించినది, యాదవ కులము. అలాంటి యాదవ కులములో కొందరు ఒక్క మహనీయుని అగౌరవపరచి ఆ మహనీయునియొక్క వాక్యమును వుల్లంఘించి హేళనచేయటంచేత, మొత్తం యాదవ కులమంతా నాశనమైపోయింది. కనుక, గొప్పవారి వాక్యములను మనము అలక్ష్యముగా తీసుకోరాదు. అపహాస్యము చేయరాదు. నీకు అర్థము కాకపోతే సాధ్యమైనంతవరకు అర్థము చేసుకోటానికి ప్రయత్నించుగాని ఆ వాక్యములను వుల్లఘించటం గాని, అపహాస్యము చేయటముగాని తగదు. ఇది మానవత్వమునకు విరుద్ధమైన గుణము. మనకు అనేక విధములైన చరిత్రలంతా వుంటున్నాయి. ఆదర్శ పురుషులైనవారి జీవితమును మనము నిరంతరము స్మరిస్తూ రావాలి. ఈ పెద్దల వాక్యములు జీవితములో యెప్పుడో ఒక పర్యాయము మనకు అవసరమవుతాయి. హాస్టల్‌లో పెట్టిన మందులు అన్నీ మనకు అప్పుడే అవసరం కాదు. ఎప్పుడో మనకు రోగములు వచ్చినప్పుడు అవసరమవుతుంటాయి. నీకు తాత్కాలికముగా ఔషధము అక్కరలేకపోవచ్చు. కానీ, ఏ ఒక్క మందు వ్యర్థము కాదు. భగవంతుని వాక్యములు, పెద్దలయొక్క వాక్యములు మందులుగా భావించుకోవచ్చు. దాన్ని వదలటానికి వీలులేదు. కనుక, భగవద్వాక్యములు ఔషధముగా భావించి మీ జీవితములో వుండిన భవరోగమును నివారణము గావించుకోండి.

**భగవన్నామమే సర్వరోగములను నివారించే ఔషధము**

ఈనాడు యీ భవరోగాలలో దేహరోగములు, మనోరోగములు, జ్ఞాన రోగములు యింకా

sri sathyasai vahini

అనేక రోగములుంటున్నాయి. అన్ని రోగములకుకూడను సరైన ఔషధము, భగవన్నామము. కనుక, అట్టి భగవన్నామమును హృదయ పూర్వకముగా వుచ్చరించి, పెద్దల వాక్యమును గౌరవించి, ఎవరిని అపహాస్యముగా చూడకుండా అందరియందు దైవభావమునే పెంచుకొని ఏకాత్మ భావముగా జీవించటానికి ప్రయత్నము చేసినప్పుడే మీరు ఆదర్శవంతమైన మూర్తులుగా తయారౌతారు. కేవలం చదువు నిమిత్తమే చదువని భావించుకోకుండా సంస్కార నిమిత్తమై చదువని గుర్తించండి. సంస్కారము లేని చదువు కేవలము చెత్త చదువే! చదువుతోపాటు సంస్కారము వుంటుండాలి. ఏ జన్మాంతర సంస్కారముచేతనో యీ అవకాశము లభించింది. చిక్కిన సదవకాశమును చక్కగా దక్కించుకోవాలి. సద్వినియోగము చేసుకోవాలి. యీనాడు ముఖ్యముగా గుర్తించవలసినది యేమంటే మంచి చెడ్డలకు, సుఖ దుఃఖములకు అన్నింటికి కర్మ ఆధారమై వుంటున్నాది. కురుక్షేత్ర యుద్ధములో అంతమంది మరణించటానికిగాని, పాండవులు కౌరవులు యుద్ధము చేయటానికిగాని కర్మయే కారణము. ఒకానొక సమయములోపల ధర్మజుడు కృష్ణుని ప్రశ్నించాడు: 'కృష్ణా! యీ తుచ్ఛమైన రాజ్యపాలన నిమిత్తమై ఎందుకు యింత పెద్ద యుద్ధము జరిపించితివి? నలభై లక్షలమంది సైన్యము ఈ యుద్ధములో చనిపొయ్యారు. కానీ, యిందులో దక్కేది పాండవులకు ఒక్కటి మాత్రమే! అదే, రాజ్యము. ఈ పంచ పాండవుల నిమిత్తమై 40 లక్షల మంది ప్రాణము తీయటము యిది యే మాత్రమైనా న్యాయమా?' అని. అప్పుడు కృష్ణుడు "పిచ్చివాడా! నీవు Quantity ని చూస్తున్నావు గానీ నేను Quality చూస్తాను. ఈ అంతరార్థమును చక్కగా గుర్తించుకో"మని చెప్పాడు. ఎన్ని కుక్కలైతే ఒక సింహమునకు సాటి అవుతాయి? ఈ కురుక్షేత్రమనేది దేహము. 'కురు' అనగా పని. పనిచేసే యంత్రము, యీ దేహము. ఇది కర్మలకు అలవాలమైనది. కనుక, ఈ దేహమును కురుక్షేత్రమన్నారు. అటువంటి ఈ దేహములో దుర్గుణములు అభివృద్ధి అవుతూ వచ్చాయి. దీనికొక చక్కని ఉదాహరణము.

**స్వార్థము హృదయములో ఉంచుకుని ఎంత పెద్ద ఉపకారము చేసినా, అది అపకారమే**

"ఒక వ్యక్తికి వీపుపైన రాచకురుపు లేచింది. అది క్రమక్రమేణా పెరిగి దేహమంతా వ్యాపించటానికి ప్రయత్నించింది. చేతిలో వస్తే చేయిని కోసేయవచ్చు. కాలికి వస్తే కాలిని

srisathyasaivachanamrutam

కోయవచ్చు. పొట్టలో వస్తే పొట్టను ఆపరేషన్ చేయవచ్చు. వీపుపైన వస్తే వీపున యేరీతిగా కోయటము? సర్వత్ర వ్యాపించి పోయింది. Spinal column వరకు వచ్చింది. అలాంటి పరిస్థితిలో యేమి చేయవలసి వస్తుంది? ఇంకా అలక్ష్యము చేస్తే దేహము అంతా వ్యాపిస్తుంది. కనుక, దానిని operation చేయటానికి నేను పూనుకున్నాను. 'వైద్యో నారాయణో హరి'. అనగా భగవంతుడు ఒక భవరోగవైద్యుడు, ఈ డాక్టరు operation చేసే సమయములో కొంతమంది నర్సులు, కాంపౌండర్సు వుంటుండాలి. కౌరవులనే దుర్గుణముల cancer పుట్టింది దేశమునకు. యిది అలక్ష్యము చేస్తే క్రమక్రమేణా వ్యాపించిపోతుంది. కనుక ధర్మజా! నేను డాక్టరుగా వుండి అర్జునుని కాంపౌండరుగా పెట్టుకొని యుద్ధమనే operation చేశాను. అందులో 40 లక్షలమంది చనిపోయారు. వీరంతా క్రిములు. ఈ cancerలో వుండిన పురుగులు చచ్చిపోతాయని ఈ వ్యక్తిని మనము చంపేదా లేక వ్యక్తిని బ్రతికించే నిమిత్తమై పురుగులను చంపేదా? ఇక్కడ చేయవలసినది ఈ విషక్రిములను చంపి మనుషులను బ్రతికించటమే! మనుష్యులలోపల దుర్గుణములుండేవారంతా cancer పురుగులవంటివారు. వీరిని చంపి పవిత్రమైన దేశమును రక్షించాను, నేను. కనుక, యిది పాపము కాద"న్నాడు కృష్ణుడు. అనగా, ఉపకార నిమిత్తము కొన్ని అపకారములు చేసినాకూడను, అది కొంతవరకు వుపకారంగానే వుంటుంది. అయితే ఆ వుపకారము ఎలాంటిదని మనము విచారించాలి. స్వార్థరహితమైన వుపకారముగా వుండాలి. స్వార్థభావము హృదయములో పెట్టుకొని ఎంత పెద్ద ఉపకారము చేసినా అది అపకారమే! భగవంతునికి స్వార్థమనేది యెక్కడాలేదు. ఏ పని చేసినా, ఏ విషయము చెప్పినా స్వార్థము లేదు. స్వార్థరహితముగా ఏ పని చేసినా యిందులో ఏ మాత్రము దోషము లేదు. ఇదంతాకూడను లోక కళ్యాణ నిమిత్తమే! లోక క్షేమ నిమిత్తమే! దైవ విషయములో 'యిదే, అదే' అని విచారణకు పూనుకోటము అజ్ఞానమే! 'దేవుడైతే యిట్లా చేయవచ్చునా, దేవుడైతే అట్లా చేయవచ్చునా,' అని అనుకోటం అజ్ఞానము యొక్క లక్షణము. దేవుడు ఏమైనా చేయువచ్చును. ఎందుకంటే సృష్టించినవాడు, రక్షించేవాడు, సంహరించేవాడుకూడా తానే! భగవంతుడు ఎందుకు రక్షించాడని ఎవరైనా ప్రశ్నిస్తున్నారా? ఆయనకు పక్షపాతము, స్వార్థము; తనను రక్షించలేదని జగడము వేస్తాడు. శిక్షించినప్పుడు ఎందుకు శిక్షించినాడు, యిది తప్పు కాదా, దేవుడు శిక్షించవచ్చునా అని జగడము వేస్తాడు.

srisathyasaivachanamrutam

ఇది స్వార్థము. ఇది వ్యక్తిగతమైన స్వార్థము. కానీ, భగవంతునికి యే స్వార్థము లేదు. భగవంతుడు చేసే దాంట్లో తర్క వితర్కములకు అవకాశము యివ్వటము బుద్ధి తక్కువ. 'దీనికి వెనకాల యే కారణాలు వుంటున్నాయో, కారణము లేని కార్యము చేయడు, భగవంతుడు.' అనుకోవాలి. దైవమును ప్రార్థించటము, అనుగ్రహమును పొందుటకు తగిన సాధన చేయటమే వ్యక్తులయొక్క కర్తవ్యముగాని, దానిని విమర్శించటానికిగాని లేక చర్చించటానికిగాని యేమాత్రము అవకాశము లేదు. భగవంతుడు ఏమైనా చేయవచ్చును.

సక్కుబాయి పండరిపురము పోవాలనుకున్నప్పుడు తాను అత్తమామల ఆజ్ఞను శిరసావహించాలి. ఒక ప్రక్కన ఈ విషయము, ఒక వైపున భగవంతునిగురించి ఆమె విచారణ చేస్తున్నది. ఆ సమయములోపల సక్కుబాయిని పండరిపురము పంపవచ్చు కదా, కృష్ణుడు. భగవంతుడు అలా చేస్తే సక్కుబాయి భర్త ఆజ్ఞ మీరిందనే అపకీర్తి పాలౌతుంది. సక్కుబాయి ఇహధర్మమును, పరధర్మమును రెండింటిని పాటించే ఆదర్శముగా నిరూపించే నిమిత్తమై కృష్ణుడు యేమి చేశాడు? సక్కుబాయి రూపము ధరించి అత్తగారింటిలోపల అవస్థలు పడుతూ వచ్చాడు. ఎందుకోసం? కారణం ఏమిటి? భగవంతుడు భక్త సంరక్షణ కోసము ఎన్ని రూపాలైనా, ఎన్ని మార్గములైనా తాను అనుభవించటానికి సిద్ధముగా వుంటాడు. ఇక్కడ లోకసంబంధమైన భక్తురాలి గౌరవమును కొంత చూడాలి. తరువాత ఆధ్యాత్మిక సంబంధమైన మార్గము యే మాత్రము తప్పిపోకూడదు. ఈ రెండూ తనకు తప్ప అన్యులకు తెలియదు. మానవులకు, తమకు సంబంధించినంతవరకు మాత్రమే యోచన ప్రవేశిస్తుంది. అన్నింటికి సంబంధించిన విషయ పరిజ్ఞానము వారికి ఉండదు. ఒకవైపున లోకమునకు ఆదర్శము నిరూపించాలి. మరొకవైపున దైవాన్నికూడను తృప్తిపరచాలి.

## దైవభక్తి అనగా మనము చేసే ప్రతి కర్మయందు దైవత్వము ఉట్టిపడాలి

విద్యార్థులు యీ రెండు మార్గములు చక్కగా అనుసరించాలి. మనము విద్యార్థులుగా వచ్చినాము. కనుక, మిగతా విద్యార్థులకు ఆదర్శవంతమైన నడకను మనము చూపించాలి. కని, పెంచి, పెద్దచేసిన తల్లితండ్రులకుకూడను సరైన తృప్తిని చేకూర్చాలి. చదివిన Institute కుకూడను చక్కని కీర్తిని తెప్పించాలి. ఈ మూడింటి సారము మన నడతలయందే వుంటుండాది.

srisathyasaivachanamrutam

ఆ నడతలు యిక్కడ వుండినా మరి ఎక్కడకు పోయినా ఒకే విధముగా వుండాలి. స్థలమునుబట్టి మన ప్రవర్తన మారితిమా యింక మనము మనుష్యులమే కాదు. కనుక, నిజమైన మానవుడు మార్పుచెందని మానవుడుగా వుండాలి. క్షణక్షణమునకు మార్పుచెందే మానవుడు మానవుడే కాదు, దానవుడు. కనుక, మొట్టమొదట కర్మను మన హృదయమునందుంచుకొని చేసే ప్రతి క్రియకూడను పవిత్రమైనదిగా చేయటానికి పూనుకోవాలి. కేవలం చేతులతో చేసే కర్మ మాత్రమే కాదు, చెవులతో వినే కర్మలు కూడను పవిత్రమైనవిగా వుండాలి. తలచే తలపులు పవిత్రమైనవిగా వుండాలి. ఈ విధముగా సర్వకర్మలయందు పవిత్రత చేరినప్పుడు అదే దేహమునకు అందించే సాత్త్వికాహారము. సాత్త్వికాహారమని డజను అరటిపండ్లు తినటము, అర్ధశేరు పలావు తినటము కాదు. రెండు శేర్లు పాలు, ఒక కిలో పెరుగు యీ విధముగా త్రాగితే యిది సాత్త్వికము కాదు. అది తమోగుణమును పెంచుతుంది. మనము తినే తిండి నోటిద్వారానే లోపలికి పోతున్నాది. పంచేంద్రియములలో నోరు ఒక యింద్రియము మాత్రమే! మిగిలిన ఇంద్రియముల ద్వారా రజోగుణ, తమోగుణ, 'ఆహారము' స్వీకరించినప్పుడు అది సాత్త్వికము ఎట్లా అవుతుంది? పంచేంద్రియములద్వారా స్వాత్త్వికమే లోపలకు పోవాలి. అదే నిజమైన సాత్త్వికము. మాట సాత్త్వికము. వినికిడి సాత్త్వికము, తలంపు సాత్త్వికము, చూపు సాత్త్వికముగా వుంటుండాలి. దైవభక్తి అనగా కేవలము ఏదో భజనలు చేయటము, స్వామి అంటే ఆశపడటము యింత మాత్రమే కాదు. మనము చేసే ప్రతి కర్మయందు దైవత్వము పుట్టిపడాలి. ఎవరి దుఃఖమునకు ఎవరూ కారణము కాదు. భీష్ముడు చెప్పినట్టుగా ఎవరి కర్మ వారు అనుభవించవలసినదే, ఆ కర్మలు పరిహారము గావించుకొనే నిమిత్తము భగవంతుని ప్రార్థించవలసినదే. కనుక, మన కర్మ ధర్మమయము కావాలి. ఈ ధర్మము బ్రహ్మమయము కావాలి. బ్రహ్మమయమైన కర్మ ఉత్తమ జన్మముగా రూపొందుతుంది. జన్మయే లేకుండా పోవచ్చును. కనుక 'జన్మ, కర్మ, ధర్మ, బ్రహ్మ యీ నాలుగు స్తంభములపైన జీవితము ఆధారపడి వుంది', అనే విశ్వాసమును మీరు మరచకుండా వుంటారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగమును విరమిస్తున్నాను.

**(తేదీ. 21-02-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahinimrutam